క్లుప్తంగా

ఆలూరు టీడీపీ అభ్యర్థిగా వీరభద్రగౌడ్

● కోట్ల సుజాతమ్మకు మొండిచేయి

ఆలూరు: ఎట్టకేలకు ఆలూరు టీడీపీ అభ్యర్థిగా వీరభద్రగౌడ్‌ను శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ప్రకటించింది. కోట్ల సుజాతమ్మ, గుమ్మనూరు జయరాం, వైకుంఠం కుటుంబం ఈ టిక్కెట్‌ను ఆశించినా.. టీడీపీ అధిష్టానం వీరభద్రగౌడ్ వైపే మొగ్గు చూపింది. అయితే ఈ టిక్కెట్ విషయంలో కోట్ల సుజాతమ్మ ఎన్నో ఆశలు పెట్టుకున్నా నీళ్లు చల్లినట్లయింది. ఒక కుటుంబానికి ఒకే టిక్కెట్ అనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పి కోట్ల కుటుంబానికి మొండిచేయి చూపారు. అయితే ఆ నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా కొందరికి వర్తింపజేయకపోవడం ఇప్పుడు కోట్ల వర్గీయుల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకే కుటుంబానికి చెందిన అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, ఇతని బావ వాసుకు టిక్కెట్లు కేటాయించారు. అలాగే చంద్రబాబు నాయుడు, లోకేష్, బాలకృష్ణకు కూడా ఒకే కుటుంబం, ఒకే టిక్కెట్ నిర్ణయం వర్తించలేదు. అదేవిధంగా ఇటీవల పార్టీలో చేరిన వేమిరెడ్డి కుటుంబానికి కూడా రెండు టిక్కెట్లు కేటాయించిన టీడీపీ.. ఒక మాజీ ముఖ్యమంత్రి కుటుంబం విషయంలో పార్టీ నిర్ణయం పేరిట కోట్లను డోన్‌కే పరిమితం చేయడం గమనార్హం. ఇకపోతే వీరభద్రగౌడ్‌కు టిక్కెట్ కేటాయించడాన్ని పార్టీలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా వ్యతిరేకిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

గడ్డివాముల దగ్ధం

మద్దికెర: స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలో శుక్రవారం గడ్డివాములకు నిప్పు అంటుకొని దగ్ధం కావడంతో దాదాపు రూ.5 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పంటలు లేకపోవడంతో పశువులకు గ్రాసం కోసం ఇతర ప్రాంతాల నుంచి వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకొచ్చి నిల్వ ఉంచుకున్నారు. అయితే మంటలకు గడ్డివాములు దగ్ధం అయ్యినట్లు బాధిత రైతులు వాపోయారు. వెంటనే అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు




ఎల్లార్తిలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఎల్లార్తి, చిన్నహ్యాట, హొళగుంద, మార్లమడికి తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అన్ని కేంద్రాలలో ర్యాంపుల ఏర్పాటు, బాత్‌రూంలు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర అన్ని ఏర్పాట్లు చేసి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఓటర్లు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్, తహసీల్దారు ప్రసాద్‌రాజు, ఆర్‌ఐ దినోజ్, వీఆర్‌ఓలకు సూచించారు. మండలంలో 47 పోలింగ్ బూత్‌లుండగా 41,467 మంది ఓటర్లు ఉన్నారని కొత్త ఓటు హక్కు పొందడానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 85 ఏళ్ల దాటి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారు పారం 12డీ ఇస్తే ఎన్నికల సిబ్బంది వారున్న చోటుకే వెళ్లి ఓటు వేయిస్తారని చెప్పారు. సభలు, ర్యాలీలు, ఇతర ఎన్నికలకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహించడానికి తప్పనిసరిగా ఎన్నికలధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. అనంతరం మార్లమడికి చెక్‌పోస్టును పరిశీలించి అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

వేలం పాటలు వాయిదా

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున హొళగుంద పంచాయతీ వేలం పాటలు వాయిదా వేసినట్లు సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఏటా మార్చి నెలాఖరులో వారపు సంతమార్కెట్, బస్టాండ్, కమేళా, సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ తదితర వాటికి వేలం పాటలు జరుగుతుండేవన్నారు. ప్రస్తుతం కోడ్ అమలులో ఉండడంతో ఎన్నికల తర్వాత వేలంపాట నిర్వహించేందుకు నిర్ణయించామని, తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ చంద్రమోహన్

పత్తికొండ రూరల్: రిమాండ్ ఖైదీలు బయటకు వెళ్లిన తరువాత నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని పత్తికొండ సబ్‌జైల్ సూపరింటెండెంట్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం పత్తికొండ సబ్‌జైల్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కాదన్నారు. పరిస్థితుల ప్రభావం, కోపం, పగ క్షణికావేశాలతో నేరాలకు పాల్పడడం వల్ల వారి కుటుంబాలు నాశనమవుతాయని వివరించారు. సన్మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక బాధ్యతతో మెలగాలన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కార్యదర్శి బి.రంగస్వామి, సామాజిక సేవకులు వెంకటేశ్వర్లు, రాజు, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం సభలో పార్టీ ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బుట్టా రేణుక, బుసినె విరూపాక్షి, కంగాటి శ్రీదేవిలను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి







జగనన్నకు నీరా‘జనం’

- జగనన్న యాత్రకు పోటెత్తిన ప్రజానీకం
- దారి పొడవునా పూలతో ఘనస్వాగతం
- వేముగోడులో ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



ఎర్రకోట వద్ద పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



వైఎస్ జగన్‌ను చూసేందుకు రోడ్డుపై వేచి ఉన్న మహిళలు, ప్రజలు

గోనెగండ్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ‘మేమంతా సిద్ధం’ బస్సుయాత్ర శుక్రవారం మధ్యాహ్నం గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామానికి చేరుకుంది. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, అభ్యర్థి బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తదితరులు సీఎం జగనన్నకు మేళతాళలు, పూలబొకేలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు దారి పొడవునా పూలు చల్లుతూ ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ కిందకు దిగి మహిళలతో మాట్లాడారు. గ్రామానికి చెందిన యాదవులు సీఎంకు గొర్రెపిల్ల, కంబలిని బహూకరించారు. మండుటెండలో రోడ్డుకిరువైపులా వేచి ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ జగనన్న ముందుకు కదిలారు. పుట్టపాశం, హెచ్.కైరవాడి గ్రామాల మీదుగా బస్సు యాత్ర సాగింది. హెచ్.కైరవాడిలో ప్రజలు విశేషంగా తరలివచ్చారు. దివ్యాంగులు నిలిచి ఉండడాన్ని గమనించిన సీఎం జగన్ బస్సు నుంచి దిగి వారితో మాట్లాడారు. వికలాంగులకు పింఛన్ పెంచాలని, 2016 చట్టం అమలు చేయాలని, ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించగా సీఎం సానుకూలంగా స్పందించారు. అలాగే గాజులదిన్నె గ్రామం మీదుగా గోనెగండ్లకు చేరుకుంది. గోనెగండ్లలో తమ అభిమాన నేతను చూడగానే ప్రజలు కేకలు వేస్తూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. సీఎం బస్సు నుంచి దిగి నాయకులు, ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కాశీరెడ్డి నాగలిని బహూకరించారు. ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, బుట్టా నీలకంఠ, టీ.నసురుద్దీన్, ఆలువాల ప్రమోద్‌కుమార్ రెడ్డి, నాగేష్ నాయుడు, బందెనవాజ్, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటూ..

నందవరం: మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. శుక్రవారం గోనెగండ్ల మండలం హెచ్.కై రవాడి గ్రామానికి మధ్యాహ్నం 1:43 నిమిషాలకు చేరుకున్నారు. గ్రామస్తులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మోహన్, పూలికొండ, సుంకన్న తమ గ్రామ సమస్యలు విన్నవించుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీపై వంతెన నిర్మాణం, గ్రామంలో తాగునీటి వసతి, ప్రధాన డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గ్రామ పాఠశాల విద్యార్థులు తరసపడగా మధ్యాహ్న భోజనం ఎలా ఉందంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు.

పూలవర్షంతో స్వాగతం

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు శుక్రవారం సాయంత్రం ఎమ్మిగనూరు మండలంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాళ్లదొడ్డి, ఎర్రకోట, సిరాలదొడ్డి క్రాస్ రోడ్డు వద్ద పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. రాళ్లదొడ్డి వద్ద సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బస్సు నుంచి దిగి మహిళలను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎర్రకోట ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో మధ్యాహ్నం భోజన విరామం తీసుకున్నారు. భోజనం చేసిన అనంతరం నాయకులతో మాట్లాడాక మళ్లీ 4.20 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది. ఎర్రకోటకు చేరుకోగానే రోడ్డు పొడవునా ప్రజలు పెద్ద సంఖ్యలో వేచిఉండడంతో రెండు చోట్ల బస్సు దిగి వారితో మాట్లాడి సెల్ఫీ దిగారు. బస్సు యాత్ర ఎమ్మిగనూరు మండలం నుంచి పట్టణంలోకి ప్రవేశించింది. మేమంతా సిద్ధం సభకు మండలంలోని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.



రోడ్డుపై ఎదురుచూస్తున్న కార్యకర్తలు



బోయబొంతిరాళ్ల నుంచి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



హొళగుంద నుంచి బస్సులో తరలివెళ్తున్న నాయకులు



చిప్పగిరిలో..



దేవనకొండలో..

దారులన్నీ సిద్ధం సభకే..

- జనసంద్రమైన ఎమ్మిగనూరు
- బస్సులు, ఆటోలు, కార్లు, బైక్‌లలో బయలుదేరిన జనం
- సీఎం ప్రసంగంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించిన ‘మేమంతా సిద్ధం’ సభకు నందవరం మండలం నుంచి భారీగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులు బయలుదేరారు. శుక్రవారం మండలం నుంచి 50 బస్సులు, 1,000కి పైగా బైక్‌లు, 100 ఆటోలు, బొలెరో వాహనాల్లో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి ఆధ్వర్యంలో భారీగా జనాలు సభకు వెళ్లారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది వివిధ వాహనాల్లో సిద్ధం సభకు తరలివెళ్లారు. రానున్న ఎన్నికల్లో మొత్తం 175 స్థానాలను కై వసం చేసుకునేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మద్దికెర: మండలంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు ఆధ్వర్యంలో దాదాపు 20 బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు. సర్పంచులు విజయుడు, మల్లికార్జున, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తుగ్గలి: ఎమ్మిగనూరు సిద్ధం సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బస్సు యాత్రలో భాగంగా శనివారం ఉదయం తుగ్గలి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.

హొళగుంద: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి నేతృత్వంలో పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా ఆధ్వర్యంలో మండలం నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో సిద్ధం సభకు తరలివెళ్లారు. షఫివుల్లా మాట్లాడుతూ.. రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్ జగన్ వల్లే సాధ్యమవుతుందన్నారు.

చిప్పగిరి: మండలంలోని 16 గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఎమ్మిగనూరు సిద్ధం సభకు తరలివెళ్లారు. సొసైటీ చైర్మన్ మల్లికార్జున, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచులు భీమ, సేనాపతి, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలం నుంచి దాదాపు 45 బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు. 5 వేలకు పైగా ప్రజలు వైఎస్సార్‌సీపీ జెండాలతో ర్యాలీ చేపట్టి, అనంతరం బస్సుల్లో, ఇతరవాహనాల్లో బయలుదేరారు.

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బసినె విరూపాక్షి ఆధ్వర్యంలో ఆస్పరి మండలం నుంచి కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సిద్ధం సభకు వాహనాలలో తరలివెళ్లారు.



ఆలూరులో సిద్ధం సభకు బయలుదేరుతున్న కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

జగనన్నకు అండగా నిలుద్దాం

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజానీకం సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఆలూరులో.. ఎమ్మిగనూరు సిద్ధం సభకు తరలివెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి 150 బస్సులు, 350 వాహనాలలో కార్యకర్తలు తరలివెళ్లారు. విరూపాక్షి మాట్లాడుతూ.. టీడీపీ నేతల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ హయాంలో నీరు – చెట్టు పథకంలో అక్రమాలకు పాల్పడిన వీరభద్రగౌడును ఆ పార్టీ మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిందని, అక్రమాలు చేసేవారికే టీడీపీలో ప్రాధాన్యత ఉటుందని ఎద్దేవా చేశారు. ఆయన సోదరుడు హాలహర్వి మండలం సిద్దాపురంలో కురుబ కులస్తులకు చెందిన భూములను ఆక్రమించుకున్నారని గుర్తుచేశారు. అక్రమాలు చేసే వారిని ప్రోత్సహిస్తున్న టీడీపీని ప్రజలు ఛీకొట్టే సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.



హాలహర్వి గ్రామం నుంచి సిద్ధం సభకు బయలుదేరుతున్న కార్యకర్తలు



మద్దికెరలో..



శభాష్‌పురంలో..



హలిగేర నుంచి బయలుదేరుతున్న కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం

- కిక్కిరిసిన ఎమ్మిగనూరు సిద్ధం సభ
- మండుటెండను లెక్కచేయక తరలివచ్చిన అభిమానగణం
- జనం హర్షధ్వానాల మధ్య సీఎం జగన్ ప్రసంగం

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఒక ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఎమ్మిగనూరు పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ‘మేమంతా సిద్ధం’ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావడంతో వైడబ్ల్యూసీఎస్ మైదానంతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జనసంద్రాన్ని తలపించాయి. సాయంత్రం 5.40 గంటలకు స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్ మొదట దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన తరువాత భహిరంగ సభలో ర్యాంప్‌పై పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. సభలో స్థానిక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక ప్రసంగం అనంతరం సీఎం వైఎస్ జగన్ ప్రసంగించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా అమలు పరిచారా అని ప్రజలను ప్రశ్నించగా చేతులెత్తి లేదు.. లేదు అంటూ ముక్తకంఠంతో బదులిచ్చారు. ఆద్యంతం సాగిన జగనన్న ప్రసంగానికి యువత, మహిళల నుంచి భారీ స్పందన లభించింది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేందుకు మీరంతా సిద్ధమా అని సీఎం అడగ్గా యువకులు, మహిళలు పార్టీ జెండాలు చేతపట్టి సిద్ధం అంటూ హోరెత్తించారు. అంతకుముందు పట్టణంలోని 8వ వార్డు ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు ఎడ్ల బండ్లపై ర్యాలీగా బయలుదేరి సిద్ధం సభకు తరలివచ్చారు. ప్రసంగం అనంతరం సీఎం జిల్లాలోని కర్నూలు ఎంపీ అభ్యర్థితో పాటు ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేయగా పార్టీ శ్రేణులనుంచి భారీగా మద్దతు లభించింది. సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, హాఫీజ్‌ఖాన్, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్యే అభ్యర్థులు బుట్టారేణుక, డాక్టర్ ఆదిమూలపు సతీష్, విరూపాక్షి, ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, పలు కార్పోరేషన్ల చైర్మన్లు రుద్రగౌడ్, బుట్టా శారదమ్మ, మాచాని వెంకటేష్, వెన్నపూస రవీంద్రారెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ గోరంట్లమాధవ్, ప్రదీప్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయమనోహరి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 8వ వార్డు ఇన్‌చార్జ్ సునీల్ ఆధ్వర్యంలో ఎడ్ల బండిపై, ర్యాలీగా సభాప్రాంగణానికి వస్తున్న మహిళలు



వైఎస్సార్‌సీపీ జెండాతో కార్యకర్త జోష్

అపూర్వ స్వాగతం



సీఎం రాక కోసం.. ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్ వద్ద గజమాలతో ఎదురుచూస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి/ఆలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ‘మేమంతా సిద్ధం’ బస్సు యాత్రకు శుక్రవారం రాత్రి ఆస్పరి మండలం ప్రజలు నీరాజనం పలికారు. మండలంలోని నగరూరు, బిణిగేరి, చిగిళి, హలిగేర, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, ఆస్పరి గ్రామాలకు చెందిన ప్రజలు సీఎంను చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. ఆస్పరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి ఆధ్వర్యంలో నాయకుడు దబ్బుల నరసప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దారి పొడవునా సీఎం జనన్‌మోహన్ రెడ్డిని చూసి ప్రజలు సంబరపడిపోయారు. చేతులు ఊపుతూ జగనన్నకు అభివాదం చేశారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, నాయకులు శ్రీరాములు, వెంకటేష్, చంద్రశేఖర్, పెద్దయ్య, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బిగ్ షాక్



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మండలంలో టీడీపీ పెద్ద షాక్ తగిలింది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గానికి చెందిన టీడీపీ నాయకుడు, గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ.కృష్ణారెడ్డితో పాటు భారీగా టీడీపీ శ్రేణులు ఆ పార్టీకి బైబై చెప్పేశారు. శుక్రవారం ‘మేమంతా సిద్ధం’ బహిరంగ సభలో పాల్గొనేందుకు ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాళ్లదొడ్డి గ్రామ సమీపంలో మధ్యాహ్న భోజన సమయంలో సీఎం వైఎస్ జగన్ కృష్ణారెడ్డికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ రాములమ్మ, వేముగోడు మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ కృష్ణవేణి, సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు రవి రెడ్డి, రంగూన్‌బాషా, పెద్దమరివీడు మాజీ సర్పంచ్ దస్తగిరి, గంజిహల్లి మాజీ సర్పంచ్ పెద్దయ్య, అలువాల తిరుమల్‌రెడ్డి, నెరడుప్పుల మాజీ సర్పంచ్ పిల్లిగుండ్ల నాగరాజు, బి.అగ్రహారం గ్రామానికి చెందిన హనుమంతరెడ్డిలతో పాటు 500 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైభవంగా వసంతోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పూర్ణాహుతి, పల్లకీ సేవ, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిని పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక స్వామి వారి బావి వద్ద వసంతోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గొర్రెల మృత్యువాత



ఆలూరు రూరల్: విషపు జొన్న కొయ్యలు తిని 23 గొర్రెలు మృతిచెందాయి. వివరాలు.. మండలంలోని అంగస్కల్ గ్రామానికి చెందిన పరషప్ప, దేవేంద్రప్ప, నాగరాజుకు చెందిన గొర్రెలు పొలంలో మేతకు వెళ్లాయి. జొన్న కొయ్యకు ఉన్న (నాము) తిని 23 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు వాపోయారు.